అధునాతనం.. లెక్కింపు సులభతరం

- తిరుమలలో ప్రారంభమైన నూతన పరకామణి భవనం
- రూ. 23 కోట్లతో ఆధునిక టెక్నాలజీతో భవంతి
- డోనర్ సెల్ కూడా ఇక్కడే ఏర్పాటుకు చర్యలు
- జర్మనీ నుంచి యంత్రాలు రాగానే నాణేల లెక్కింపు కూడా..





హుండీలను నూతన భవనానికి తరలిస్తున్న సిబ్బంది

తిరుమల: తిరుమలలో పుష్కరిణికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో టీటీడీ నూతనంగా నిర్మించిన పరకామణి భవనంలో ఆదివారం నుంచి కానుకల లెక్కింపు ప్రారంభమైంది. బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో కూడిన పరకామణి భవనాన్ని నిర్మించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా 2022 సెప్టెంబరు 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ఈ భవనాన్ని ప్రారంభించారు. హుండీ ఆదాయం సరాసరి రోజువారి రూ.3 కోట్లు వస్తుండడంతో లెక్కింపునకు సిబ్బంది, స్థలం కొరత ఉంటోంది. ఒక దశలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి రాత్రి వేళల్లో కూడా లెక్కింపు చేపట్టేవారు. నిత్యం 250 మంది వరకు పరకామణి మండపానికి వెళ్లాల్సి ఉండడం.. అక్కడ స్థల లభ్యత తక్కువగా ఉండడం..క్లోజడ్ సర్క్యూట్ ఉండే ఈ ప్రదేశంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో డెప్యూటేషన్‌పై పరకామణి విధులకు వచ్చేందుకు టీటీడీ ఉద్యోగులు వెనకడుగు వేసేవారు. కానుకలు లెక్కింపు పూర్తి స్థాయిలో జరగకపోవడం.. నిత్యం 300 వరకు చిల్లర నాణేల మూటలను తరలించడం వంటివి ఇబ్బందికరంగా మారడంతో అన్ని వసతులతో కూడిన పరకామణి మండపాన్ని నిర్మించాలని మూడేళ్ల కిందట టీటీడీ నిర్ణయించింది. అందుకు అనుగుణంగా శ్రీవారి పుష్కరిణికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో రూ.9 కోట్లతో నూతన మండపాన్ని నిర్మించేందుకు 2020 ఆగస్టులో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించింది. భవన నిర్మాణం పూర్తయ్యే సరికి రూ.23 కోట్లు ఖర్చు అయ్యింది.

ఇప్పటి వరకు..

శ్రీవారి ఆలయంలోని ఆనంద నిలయానికి వెనుక ఉన్న మండపంలో కానుకలు లెక్కించేవారు. 153 అడుగులు ఉండే ఈ మండపంలో నోట్ల పరకామణి చేపట్టేవారు. నాణేలను ఆలయానికి ఆగ్నేయ దిశగా ఉన్న 80 అడుగులు పొడవు, 36 అడుగులు ఉండే కల్యాణ మండపంలో లెక్కించేవారు. క్రీశ 1586 విజయనగర సామ్రాజ్య ప్రతినిధి చెన్నప్ప నిర్మించిన ఈ మండపంలోనే నాణేలను లెక్కిస్తున్నారు.

నేడు అధునాతనం..

కొత్త పరకామణి భవనాన్ని 15 వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కానుకలకు సంబంధించిన అన్ని కేంద్రాలను ఇక్కడే ఏర్పాటు చేశారు. నోట్లతో పాటు బంగారం, వెండి, ఇతర వస్తువుల లెక్కింపు మొత్తం కూడా ఈ భవనంలోనే జరుగనుంది. విశాలమైన భవనం .. నూతన హంగులు ఉండడంతో పరకామణి సులభతరం కానుంది. ఇకపై ఏ రోజు కానుకలు ఆరోజు లెక్కించే వెసులుబాటు లభించనుంది. డోనార్ సెల్‌ను కూడా ఇదే మండపంలో ఏర్పాటు చేయనుండడంతో విరాళాలు ఇచ్చే వారికి కూడా సౌలభ్యం ఏర్పడనుంది. కానుకల లెక్కింపును భక్తులు ప్రత్యక్షంగా వీక్షించే వెసులుబాటు కూడా కల్పించారు.

త్వరలోనే చిల్లర నాణేల లెక్కింపు

నాణేల లెక్కింపునకు సంబంధించి నూతన యంత్రాలు ఇంకా రాకపోవడంతో ప్రస్తుతానికి తిరుపతిలోని పరకామణి మండపంలోనే కొనసాగించనున్నారు. జర్మనీ నుంచి నూతన యంత్రాలు తిరుమలకు చేరుకోగానే నాణేల లెక్కింపును కూడా కొత్త భవనంలో చేపడుతారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళను వేధించిన కేసులో రిమాండ్

తిరుపతి లీగల్ : ఓ మహిళకు ఫోన్ చేసి వేధించడంతోపాటు అసభ్యకర ఫోటోలు పోస్టు చేసిన కేసులో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నగరిమిట్టకు చెందిన కావేటి ప్రసాద్ అలియాస్ నవీన్‌కు ఈనెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ బుధవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 16వ తేదీన తిరుపతి ఎమ్మార్‌పల్లె ఎల్‌బీ నగర్‌లోని ఓ మహిళకు నిందితుడు పలుమార్లు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో పాటు అసభ్యకర ఫోటోలను ఆమె ఫోన్‌కు పంపడంతో ఆమె ఎస్వీయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

వాకింగ్ కాస్త రన్నింగ్ అవుతుంది జాగ్రత్త

- మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లేదు
- టీడీపీ హయాంలోనే అక్రమ దందాలు
- నారాలోకేష్ వ్యాఖ్యలపై పోకల అశోక్‌కుమార్ ఆగ్రహం



తిరుపతి మంగళం : 'జిల్లాలో ప్రశాంతంగా పాదయాత్ర పేరుతో పదిమందితో కలిసి వాకింగ్ చేసుకుని వెళుతున్నావ్, మంత్రి పెద్దిరెడ్డిని, మా ఎమ్మెల్యేలను విమర్శిస్తే వాకింగ్ కాస్త రన్నింగ్ అవుతుంది' జాగ్రత్త అని నారా లోకేష్‌ను టీటీడీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో మంత్రి పెద్దిరెడ్డితో పాటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై నారాలోకేష్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఓర్వలేకే పెద్దిరెడ్డిపై అవాస్తవ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పంలో 30 ఏళ్ల టీడీపీ జెండాను పెకిలించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదని స్పష్టం చేశారు. చిత్తూరులో ఎమ్మెల్యే భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఎలా ఆరోపిస్తారంటూ మండిపడ్డారు. టీడీపీ హయాంలోనే అక్రమ దందాలు విపరీతంగా జరిగాయని స్పష్టం చేశారు. మీ నాన్న చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఇసుక దందా చేస్తున్న అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మహిళా తహశీల్దార్‌పై జుట్టు పట్టుకుని దాడి చేయలేదా? అని ప్రశ్నించారు. ఇసుక, ఎర్రచందనం, మైన్స్ వంటి దందాల గురించి మీరు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో ఎమ్మెల్యేలు, జన్మభూమి కమిటీ సభ్యులు దోచుకున్నంతగా మరెవ్వరూ దోచుకోలేదన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో నవశకానికి నాంది పలికి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేశారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల గ్రామ పంచాయతీలో ఎంపీపీ మోహిత్ రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా ఆయన, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు శ్రీరాములు, బడి వెంకటేష్ యాదవ్, సుబ్రమణ్యం నాయుడు, యూత్ మండల అధ్యక్షుడు గోపి, ఎంపీటీసీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రాథమిక పాఠశాలను, అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అలాగే మహా పాదయాత్ర చేపట్టిన ఎంపీపీకి మద్దతుగా మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, చిగురువాడ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అవిలాల లోకనాథ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, పంచాయతీ నాయకులు మహేంద్ర, మురళి, దిలీప్, గ్రామస్తులు ఉన్నారు.

పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు



వైద్యసిబ్బంది నుంచి వివరాలను రాబడుతున్న అధికారులు

తిరుపతి తుడా : స్థానిక వైద్యసేవలను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఈమేరకు బుధవారం తిరుపతి, చిత్తూరు జిల్లా పరిధిలోని తిరుపతి, కేవీబీపురం, సూళ్లూరుపేట, తుంబకుప్పం, బంగారుపాళ్యం మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరెడ్డి నేతృత్వంలో అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్యసేవలతో పాటు రికార్డులు, మందుల నిల్వలు, హాజరుపట్టిక, వ్యాక్సిన్ నిల్వలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌ఓ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను చేపట్టిందన్నారు. ఈక్రమంలో క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్యం అందుతోందా? అలానే పీహెచ్‌సీల్లో తగిన వసతులు ఉన్నాయా? వైద్యులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారు? రోగులకు వైద్యపరీక్షల నిర్వహణ ? మందులు, వ్యాక్సిన్ల నిల్వలపై తనిఖీలు చేశామని చెప్పారు. అలానే ఆర్‌బీకే, సంక్షేమ వసతి గృహాలపై వరుస తనిఖీలు ఉంటాయని చెప్పారు,

పాదయాత్రతో పరువు తీస్తున్న లోకేష్

- చంద్రబాబు ఓ డీసెంట్ కిల్లర్
- ఆయన ఉచ్చులో పవన్
- లోకేష్‌పై పోటీకి సిద్ధం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నారా లోకేష్‌పై పోటీ చేసేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఆయన స్వగ్రామం ఊరందూరులో నేటికీ ఒక్క మురుగు కాలువ కూడా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఊరందూరును పురపాలక సంఘంలో చేర్చి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆ పనులను రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని మండి పడ్డారు. ఒక కుటుంబం స్వప్రయోజనాల కోసం గ్రామం అభివృద్ధికి దూరంగా ఉండాలా అని ప్రశ్నించారు. ఆ గ్రామ నీలకంఠేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం కూడా నిర్వహిస్తున్నామన్నారు.

హాస్య పర్వంగా..

ఎమ్మెల్యేగా గెలవలేని లోకేష్ 151 సీట్లు గెలిచిన సీఎం జగన్‌పై విమర్శలు చేసే హక్కు లేదని ఎమ్మెల్యే మధు మండిపడ్డారు. రాజకీయాల్లో అనుభవం, అర్హత లేని లోకేష్ పెయిడ్ ఆర్టిస్టులతో కలిసి పాదయాత్ర పరువు తీస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర కోసం మూడు నెలలు శిక్షణ తీసుకున్నా ప్రజల్లో ఇమడలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. నడవలేని రోజు పోలీసులతో గొడవపెట్టుకుని చిన్నపిల్లవాడిలా పాదయాత్ర దూరాన్ని తగ్గించుకుంటున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర సోషల్ మీడియాలో హాస్య పర్వంగా కొనసాగుతోందని తెలిపారు. లోకేష్ ప్రసంగాలు చూసి చంద్రబాబు తలలు పట్టుకుంటున్నారని తెలిపారు.

విద్య కోసమే ఏటా రూ.30వేల కోట్లు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడి భావితరాల భవిత కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. విద్య కోసమే ఏటా రూ.30 వేల కో ట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. తమ ప్రభు త్వం తీసుకున్న చర్యల కారణంగా 2018–19లో 37.20 లక్షలుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, 2021–22లో 44.29 లక్షలకు పెరిగిందని ఎమ్మెల్యే వివరించారు.

కుష్ఠు రహిత జిల్లాగా తిరుపతి

- ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా : కుష్ఠు రహిత జిల్లాగా తిరుపతిని ఆవిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం నుంచి కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. నగరంలోని జ్యోతి లెప్రసీ కాలనీలో కుష్ఠు వ్యాధిపై అవగాహన, చికిత్స కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి హాజరైన డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ బహుళ ఔషధ చికిత్సలతో వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యం కాదని తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో చికిత్స అందించే చర్యలు జరుగుతున్నాయన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. కుష్ఠు, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ అరుణ సులోచన, మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు హీనా, ఇతర వైద్యాధికారులు డాక్టర్ మధుబాబు, డాక్టర్ హేమంత్, ఫిజియోథెరపిస్ట్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం



తహసీల్దార్‌ను అడ్డుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

ఓజిలి: మండలంలోని పున్నేపల్లె ఎస్సీ కాలనీలో బుధవారం పోలీసుల సమక్షంలోనే తహసీల్దార్ లాజరస్‌పై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. పున్నేపల్లె ఎస్సీ కాలనీలో పంచాయతీ కేటాయించిన స్థలంలో నాడు–నేడు పథకం కింద రూ.16 లక్షలతో అంగన్‌వాడీ భవనం మంజూరైంది. భవన నిర్మాణానికి అధికారులు పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు పూర్తి చేశారు. ఈ భవనం పక్కనే నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్తలు మైలారి పెంచలయ్య, సుబ్రమణ్యం అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు. అంగన్‌వాడీ భవనం వల్ల తమకు దారి సౌకర్యం లేకుండాపోతోందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జేసీ బాలాజీ అంగన్‌వాడీ భవనం పరిసరాల స్థలాలను సర్వే చేయాలని తహసీల్దార్ లాజరస్‌ను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వో సర్వే నిర్వహించారు. మైలారి పెంచలయ్యతో మాట్లాడుతూ మీ ఇంటికి ఉత్తరం పక్కన దారి ఉందని, దాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. దారి చూపి అధికారులు కార్యాలయానికి వెళ్తుంటే తమకు మూడు అడుగుల స్థలం కావాలంటూ టీడీపీ కార్యకర్తలు తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. పోలీసులు సమక్షంలోనే వాగ్వాదానికి దిగి తహసీల్దార్‌ను అడుగుముందుకు వేయనీయకుండా దౌర్జన్యానికి దిగారు. తహసీల్దార్ వారికి సర్ది చెప్పినా వినలేదు. ఎస్ఐ ఆదిలక్ష్మి తహసీల్దార్‌ను కారులో ఎక్కించారు. అయిన టీడీపీ కార్యకర్తలు కారు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఎస్ఐ, పోలీసులు వారిని పక్కకు నెట్టివేసి తహసీల్దార్ లాజరస్‌ను సురక్షితంగా పంపారు.

క్రీడా పోటీల్లో దివ్యాంగ ఉద్యోగుల ప్రతిభ



చెస్ పోటీలో తలపడుతున్న దివ్యాంగులు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీల్లో బుధవారం జరిగిన పలు విభాగాల్లో దివ్యాంగ ఉద్యోగులు ప్రతిభ కనబరిచారు. చదరంగం పోటీల్లో బి.అరుణకుమారి విజేతగా నిలవగా, విజయలక్ష్మి రన్నరప్‌గా నిలిచారు. పాక్షిక అంధుల చెస్ పోటీల్లో రెడ్డెప్ప రెడ్డి విజేతగా, డి.త్యాగరాజు రన్నరప్‌గా నిలిచారు. చెస్ పోటీల్లో రవికుమార్ విజేతగా, ఎంఏవీ సత్యం ద్వితీయ స్థానం పొందారు. క్యారమ్స్‌లో మునివెంకట ప్రసన్న విజేత కాగా ఎల్.కుమారి రన్నరప్‌గా నిలిచారు. పురుషుల క్యారమ్స్‌లో చంద్రశేఖర్ విజేత కాగా మధుసుదనశర్మ రెండో స్థానంలో నిలిచారు. క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో చంద్రశేఖర్, శ్రీబాబు విజేతలు కాగా బి.శ్రీకాంత్, డి.శ్రీనివాసులు రన్నర్స్‌గా నిలిచారు. 45సంవత్సరాల లోపు మహిళల పాసింగ్ ది లగేజ్ పోటీల్లో రమాదేవి జట్టు విజయం సాధించింది. ఎం.సునంద జట్టు రెండో స్థానంలో నిలిచింది.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



కృష్ణాపురం అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న దుంగలు

రేణిగుంట: రేణిగుంట, రైల్వే కోడూరు మండలాల్లో బుధవారం కూంబింగ్ ఆపరేషన్లలో 38 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి సూచనల మేరకు మంగళవారం రాత్రి రెండు టీములుగా కూంబింగ్ నిర్వహించారు. మండలంలోని కృష్ణాపురం బీట్ పరిధిలో బుధవారం ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం కూంబింగ్ చేస్తుండగా శేషాచలం అడవి చీకిగుట్ట వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకొస్తూ కనిపించారు. పోలీసుల అలికిడిని గమనించి దుంగలను అక్కడే పడేసి పరారయ్యారు. 22 అలాగే బాలపల్లి సెక్షన్ సిద్దిలేటి కోన కంగిమడుగు వద్ద ఎర్రచందనం మోసుకొస్తున్న కొందరు వ్యక్తులు కూంబింగ్ సిబ్బంది టార్చ్‌లైట్లు వేసుకు వస్తుండడాన్ని చూసి దుంగలను పడేసి పరారయ్యారు. అక్కడ మరో 16 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లో పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ తెలిపారు. కూంబింగ్‌లో పాల్గొన్న టీము సభ్యులను ఎస్పీ చక్రవర్తి అభినందించారు.

సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జిని మార్చాల్సిందే

- అసమ్మతి వర్గం సమావేశం

సత్యవేడు: తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే హెచ్.హేమలత కుమార్తె హెలన్ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకోవడం లేదని, ఇన్‌చార్జిని మార్చాలని అసమ్మతివర్గ సభ్యులు బహిరంగంగానే డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో నియోజవర్గ స్థాయిలో టీడీపీ అసమ్మతి నాయకులు సమావేశం నిర్వహించారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుందరరామిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పద్మనాభరాజు, స్టేట్ లీగల్ సెల్ సెక్రటరీ రోశయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాదరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు గోవిందస్వామి, నాగలాపురం ఎంపీటీసీ ప్రేమ సెల్వకుమార్, సుబ్రమణ్యం రాజు తదితరులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నిజమైన కార్యకర్తలు ఎవరో, దళారులెవరో తెలుసుకోలేక పోతున్నారన్నారు. పార్టీ కోసం పని చేసే వారిని నియమించాలని కోరారు. పార్టీ నాగలాపురం మండల మాజీ అధ్యక్షుడు భాస్కర్ శెట్టి, నారాయణవనం మాజీ ఎంపీపీ గోవిందస్వామి, కేవీబీపురం మాజీ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి, యాచంద్ర నాయుడు, లోకయ్యరెడ్డి, రాధయ్య, హేమభూషణం, పృధ్వీ పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



రూమును ప్రారంభిస్తున్న ప్రభావతి, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్లు

చంద్రగిరి: స్థానిక చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో(సీహెచ్‌సీ) స్టాండైజేషన్ ఆఫ్ డెలివరీ రూమ్(లేబర్ రూము)ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి అన్నారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన లేబర్ రూమును బుధవారం ఏరియా ఆస్పత్రి కమిటీ డైరెక్టర్లతో కలసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యబృందం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో డెలివరి రూములో కాన్పులకు అవసరమైన సుమారు 53 పరికరాలను సమకూర్చుతూ లేబర్ రూమును సిద్ధం చేశామన్నారు. ఆస్పత్రిలో త్వరలోనే పీడియాట్రిక్స్, గైనకాలజిస్టును నియమించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు రెడ్డెప్ప, మమత, బోడిరెడ్డి అచ్యుత, విజయ్ కుమార్ రెడ్డి, వైద్యులు హరిప్రసాద్, ఠాగూర్, స్పందన, కీర్తి, హిమబిందు, తనూజ, సోమశేఖర్, హెడ్ నర్సులు కళావతి, జయ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవోదయ దరఖాస్తుకు 15 వరకు గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ వరకు గడువును పొడిగించారు. ఆ మేరకు వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

171 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 171 మందికి రూ.71,860 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్, వెస్ట్, ఎస్వీయూ, ఈస్ట్, అలిపిరి పోలీసులు నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వైకుంఠధామం షాపుల వేలం రేపు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలో నూతనంగా నిర్మించిన తుడా కాంప్లెక్స్‌లోని షాపులను శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు వైకుంఠ ధామం సేవాసమితి సొసైటీ అధ్యక్షుడు జయ చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం తుమ్మలగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంప్లెక్స్‌లో ఐదుషాపులను వేలం ద్వారా కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కాంప్లెక్స్ వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

స్కూటరిస్టు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్

భాకరాపేట : గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి చెందినట్లు ఎస్ఐ ప్రకాష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పీలేరు–తిరుపతి జాతీయ రహదారి మార్గంలోని యడమవారిపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం ఏపీ03 సీఎఫ్9766 నంబరుతో ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పాకాల మండలం పెద్దరామాపురం పంచాయతీ యనమలవారిపల్లె హరిజనవాడకు చెందిన యాదాల వెంకటేష్ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించి, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

రామచంద్రాపురం: మండలంలోని బీరమాకు లకండ్రిగలో ఇటీవల మృతిచెందిన కన్నెమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని వడ్డెర సంఘం నాయకులు అమర్‌నాథ్ శ్రీరామ్ బుధవారం తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె ఇంటి ప్రహరీగోడను ఆనుకుని పోసిన మట్టిని తొలగించాలన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో బాలాజీ, మదన్, జగన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- ఏప్రిల్ 5న శ్రీకోదండరాముని కల్యాణం
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాల సమర్పణ
- బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి అలిపిరి: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 30వ తేదీ నుంచి అంగరంగా వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుమతి దేవస్థానం జేఈఓ వీరబ్రహ్మం చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన టీటీడీలోని వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష జరిపారు. దానికి ముందు రాజంపేటలోని 108 అడుగుల తాళ్లపాక అన్నమాచార్య విగ్రహం ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం జేఈఓ విలేకరులతో మాట్లాడుతూ మార్చి 30వ తేదీ సాయంత్రం అంకురార్పణతో శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ శ్రీ కోదండ రాముని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టువస్త్రాలను సమర్పిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు, స్వామివారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నెలరోజుల ముందు నుంచే టీటీడీ ఈ పనులను ప్రారంభించిందని ఆయన చెప్పారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులను అనుమతించాల్సిన విధానం, భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. గ్యాలరీలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికీ స్వామివారి ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి రెండు వారాల్లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, విద్యుత్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, డిప్యూటీ ఈఓలు గుణభూషణ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఈఈ సుమతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డీఎఫ్ఓ శ్రీనివాస్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, ప్రచురణల విభాగం ప్రత్యేక అధికారి రామరాజు పాల్గొన్నారు.

జానపద కళాకారుల వినతి



జేఈఓ సదాభార్గవికి వినతిపత్రం అందజేస్తున్న జానపద కళాకారుల సంఘ నాయకులు

తిరుపతి అలిపిరి: తమ సమస్యలు పరిష్కరించాలని జానపద వృత్తికళాకారుల సంఘం నాయకులు టీటీడీ జేఈఓ సదాభార్గవికి బుధవారం ఆమె చాంబర్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. భజన కళాకారుల చేర్పులు, మార్పులు, కొత్త బృందాల నమోదు, వాయిద్య పరికరాలు, మైక్‌సెట్‌లు, దర్శనంతో పాటు లడ్డూ ప్రసాదం, పెండింగ్ బిల్లులు, గురువులకు సన్మానం, గౌరవ వేతనం వంటి విషయాలపై జేఈఓతో చర్చించినట్లు జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి, కోశాధికారి దేవానంద్, తిరుపతి జిల్లా కార్యదర్శి వేణు, చిత్తూరు జిల్లా నాయకులు రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి సారించండి

- ప్రజలను భాగస్వామ్యులు చేయండి
- కమిషనర్ అనుపమ అంజలి



సమీక్షిస్తున్న కమిషనర్ అనపమ అంజలి

తిరుపతి తుడా : స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల నేపథ్యంలో ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో స్వచ్ఛతను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి ఆదేశించారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వరరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణతో కలసి బుధవారం ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ పోటీల్లో గతేడాది మెరుగైన ఫలితాలను సాధించామని చెప్పారు. ఆ స్థానాలను సుస్థిరం చేసుకుని ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో అగ్రస్థానంలో నిలిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛపోటీల్లో ప్రజలను భాగస్వామ్యులు చేయాలన్నారు. తిరుపతికి మెరుగైన ఫలితాలు రావడం వెనుక ప్రజల సహకారం మరువలేనిదే అన్నారు. నగరంలోని 51 టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని పరిశుభ్రంగా ఉంచేందుకు ఇంజినీర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా పింక్ టాయిలెట్లను ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటి శుద్ధికేంద్రాలు, నిర్వహణ, చెత్త సెగ్రిగేషన్ వంటి అంశాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డీఈఈలు విజయకుమార్ రెడ్డి, దేవిక, రవీంద్రారెడ్డి, సంజయ్‌కుమార్, గోమతి, మహేష్, శానటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్



వై.వీర్రాజు, 3వ అదనపు జిల్లా జడ్జి

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో ఈనెల 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ వై.వీర్రాజు బుధవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించడానికి ఐదు బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు. ఆ బెంచ్‌లలో ఒక బెంచ్‌కు తాను అధ్యక్షత వహించనుండగా మిగతా బెంచ్‌లకు తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పి.కోటేశ్వరరావు, 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్, 5వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వై.సరిత వ్యవహరిస్తారని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే క్రిమినల్ కేసులతో పాటు సివిల్, మోటారు వాహన ప్రమాద కేసులు, వినియోగదారుల కమిషన్‌లోని కేసులతో పాటు వివాహ సంబంధ కేసులు, తదితర కేసులను పరిష్కరిస్తామన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేందుకు న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఇతర సంస్థల అధికారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



నూతన వధువు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వివాహ కానుకను అందజేస్తున్న నేతలు

చంద్రగిరి: మండలకేంద్రంలోని కొత్తపేటకు చెందిన నూతన వధూవరులకు బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, దెయ్యాల మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌలిరెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపించిన వివాహ కానుకను అందజేశారు. కొత్తపేట నూకులగుంట రోడ్డులోని భరత్ రెడ్డి, పావని అలాగే భవానీ నగర్‌కు చెందిన తేజ, సంయుక్తకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన వధూవరులకు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తానాటి చంద్రశేఖర్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ వాసురెడ్డి

పాకాల : రైతులకు, విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పాకాల, దామలచెరువు సబ్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వచ్చే వేసవిలో వ్యవసాయానికి, గృహ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని సూచనలు చేశారు. సరఫరాకు సంబంధించిన ప్రణాళికను ముందుగా తయారు చేసుకోవాలన్నారు. పాకాల డీఈఈ నరేంద్ర, ఏఈలు ప్రశాంత్, జనార్దన్‌రావు, ఎల్ఐ రామన్, తులసీప్రసాద్, కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యంలో నూతన ఒరవడి



పశు సంచార వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పశు వైద్యానికి నూతన ఒరవడిని సృష్టించారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గానికి కేటాయించిన రెండో సంచార పశు వైద్య వాహనాన్ని బుధవారం చెర్లోపల్లి గ్రామంలో ఆయన ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో 1962కు ఫోన్ చేసి పశు వైద్యసేవలను సద్వినియోగం చేసకోవాలన్నారు. పాడిరైతుల శ్రేయస్సు కోసం రాష్ట్రప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు అత్యాధునిక సంచార పశువైద్య సేవల వాహనాలు మంజూరు చేసిందన్నారు. నాయకులు శుభగిరి నాయుడు, వాసుదేవ నాయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, చంద్రగిరి ఎంపీపీ హేమేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకం రేపు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల

తిరుచానూరు : తిరుచానూరు పంచాయతీ, యోగిమల్లవరం గ్రామంలో వెలసిన శ్రీకామాక్షాంబ సమేత శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయంలో 10వ తేదీన మహాకుంభాభిషేక వేడుకలు జరగనున్నాయి. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి, ఇతర దాతల ఆర్థిక సహకారంతో జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి మహాకుంభాభిషేక పూజలను ఆలయ ప్రధానార్చకులు మూర్తి గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆలయం ఎదుట 33 హోమగుండాలతో ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్లతో పాటు పరివార దేవతలను శాస్త్రోక్తంగా కలశాల్లో ఆవాహనం చేసి హోమాదిపూజలు నిర్వహించారు. 10వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మహాపూర్ణాహుతి, విమానగోపురం, రాజగోపురం, స్వామి, అమ్మవార్లు, పరివార దేవతలకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మూలవర్లకు ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆదిదంపతుల కల్యాణం, అనంతరం పరివార దేవతలతో వీధోత్సవాన్ని నిర్వహించనున్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



తృణధాన్యాలు, చిరుధాన్యాల దినోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్లు

తిరుచానూరు : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బయోసైన్సు, సెరికల్చర్ విభాగం వెబినార్ కన్వీనర్ ప్రొఫెసర్ జి.సావిత్రి అన్నారు. అంతర్జాతీయ తృణధాన్యాలు, చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళా బయోసైన్స్ సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ చొరవతో 'నిత్య జీవన విధానంలో సిరి ధాన్యాల ప్రాముఖ్యత' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తాత, ముత్తాతల కాలం నాటి చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను, వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రకృతి వ్యవసాయం అవసరాన్ని వివరించారు. విశ్వవిద్యాలయ రిజిస్టర్ ప్రొఫెసర్ ఎన్.రజని మాట్లాడుతూ మంచి దృఢమైన శరీర నిర్మాణానికి ఎన్నో ఆరోగ్యకరమైన సమస్యల నుంచి శరీరాన్ని కాపాడుకోవడంలో చిరుధాన్యాలు ప్రముఖ పాత్రను పోషిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజాత, రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ ఎమ్.డాక్టర్ ఎన్.సువర్ణలత, డాక్టర్ కేఎస్ శాంతి, డాక్టర్ ఎ.శోభారాణి, డాక్టర్ హేమలత, డాక్టర్ రేఖ, డాక్టర్ హరిప్రియ, రిసోర్స్ పర్సన్ డాక్టర్ జి.గంగాధరన్, ప్రొఫెసర్ డీఎం మమత, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

లోన్ యాప్‌లతో జాగ్రత్త

- జిల్లా ఏఎస్పీలు జే.వెంకటరావు, విమలకుమారి



మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటరావు

తిరుచానూరు : నకిలీ లోన్ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకూడదని, అపరిచితులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదని ఏఎస్పీలు జే.వెంకటరావు, విమల కుమారి తెలిపారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎస్వీయూ ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్వీఎస్ సత్యనారాయణ సహకారంతో సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో సైబర్ క్రైమ్ ప్రముఖ నిపుణులు ఈఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రపంచ మొత్తం మీద సైబర్ క్రైమ్ రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళలనే టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో లక్షకు పైగా ఈ సైబర్ మోసాలు జరుగుతున్నాయని వివరించారు. తిరుపతి జిల్లా ప్రజలే కాకుండా తిరుపతికి వచ్చే భక్తులు కూడా ఈ మొబైల్ హంట్ అప్లికేషన్ సేవలను ఉపయోగించుకోవాలంటే మొబైల్ పోయినవారు 9490617873 నంబర్‌కు వాట్సాప్ ద్వారా మెసేజ్ చేస్తే వారికి ఒక గూగుల్ అప్లికేషన్ ఫామ్ వస్తుందన్నారు. వివరాలు, పోగొట్టకున్న మొబైల్ వివరాలను నమోదు చేసి పంపితే తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు, వాటిని రికవరీ చేసి వారి స్వస్థలానికి సంబంధించిన పోలీస్ స్టేషన్‌లను పంపించి బాధితులకు అందజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ సైబర్‌నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా స్వయంగా సైబర్ క్రైమ్ ఆఫీస్‌కి వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీస్ శాఖ వారు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. సైబర్ క్రైమ్ ప్రముఖ నిపుణులు ఈఎల్ నరసింహారావు మాట్లాడుతూ సైబర్ నేరాలపై సరైన అవగాహన లోపం కారణంగా చాలామంది సులభంగా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్నారని వివరించారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ రామచంద్ర రెడ్డి, ఎస్ఐలు, సైబర్ ల్యాబ్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి పరిహారం చెల్లించండి

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో చెక్కు సొమ్ముతో పాటు పరిహారం సొమ్మును ఫిర్యాదుదారుడికి నెలలోపు చెల్లించాలని లేకుంటే రెండేళ్లు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తిరుపతి 6వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బుధవారం తీర్పు చెప్పారు. కేసులోని వివరాల మేరకు.. తిరుపతి ఆర్‌సీ రోడ్డుకు చెందిన మిట్టా ప్రదీప్‌కుమార్ వద్ద నుంచి తిరుపతి గోవిందరాజస్వామి గుడివీధిలోని లావణ్య ఫొటో ల్యామినేషన్ యజమాని వి.శంకర్‌నాయుడు 2004 జనవరి 19న రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చాడు. తన సొమ్మును తిరిగి చెల్లించాలని మిట్టా ప్రదీప్‌కుమార్‌తో కోరడంతో శంకర్‌నాయుడు కొంత సొమ్ము ఇచ్చి మిగతా సొమ్ము త్వరలో చెల్లిస్తానని చెప్పాడు. 2013 జూలై 22న శంకర్‌నాయుడు రూ.60 లక్షలు విలువ చేసే చెక్కును ప్రదీప్‌కుమార్‌కు ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో ప్రదీప్‌కుమార్ కోర్టులో శంకర్‌నాయుడుపై చెక్‌బౌన్స్ దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అసలు, వడ్డీ కలిపి రూ.90 లక్షలకు పైగా ఫిర్యాదుదారుడుకి శంకర్‌నాయుడు చెల్లించాలని, అలాగే రూ.20 వేలను నష్టపరిహారం కింద కోర్టులో జమ చేయాలని తీర్పు చెప్పారు. చెక్కు సొమ్ముతో పాటు వడ్డీ సొమ్ము కలిపి నెలరోజుల్లోపు చెల్లించకుంటే రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం



విరాళాలను అందజేస్తున్న నడింపల్లి గ్రామస్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణానికి పెద్దఎత్తున దాతల నుంచి విరాళాలు అందిస్తున్నారు. సుమారు రూ.3.5 కోట్లతో ఆలయ పునర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని నడింపల్లి గ్రామస్తులు రూ.2,44,348, పాకాల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వెంకట సుబ్రమణ్యం రూ.50,116 ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వారికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి మహిమాన్విత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయం పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావడం ఎన్నోజన్మల పుణ్యఫలమన్నారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన నడింపల్లి వాసులు విరాళాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజభవన్ పరిరక్షణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న బలిజ,కాపు నేతలు

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులోని బలిజ భవన్ పరిరక్షణ పనులు బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. బలిజ భవన్ అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు చర్యలు చేపట్టాలని గత రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి బలిజ నేతలు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే భూమన సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు బలిజ భవన్ స్థలం సర్వే చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రస్తుతం బలిజ, కాపు నేతల ఆధ్వర్యంలో బుధవారం భవన్ పరిరక్షణ పనులు ప్రారంభించారు. బలిజ, కాపు నేతలు ఆళ్వారు మురళి, కరుణానిధి, దుద్దేల బాబు, సురేష్, మధు పాల్గొన్నారు.